విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

అటవీ బంజరు భూములు పేదలకు పంచాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: ప్రభుత్వం అటవీ బంజరు భూములు పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేసారు.టి నరసాపురంలో సీపీఐ మండలం కార్యదర్శి సాకా గంగరాజు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం టి నరసాపురం,బందంచర్ల గ్రామాలలో నిరుపయోగంగా వున్న అటవీ బంజరు భూముల్లో వన సంరక్షణ సమితులను ఏర్పాటు చేసి భూమి లేని పేదలకు కుటుంబానికి హెక్టారు చొప్పున భూపంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దున్నేవానిదే భూమి నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని పంచిన ఘనత సీపీఐదేనని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల రూపంలో ప్రజలను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. పేదలకు మెరుగైన జీవన విధానం భూమిని సాగు చేయడం ద్వారానే లభిస్తుందని తెలిపారు. జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు భూమి దక్కే వరకు పేదల పక్షాన సీపీఐ అలుపెరగని పోరాటం చేవస్తుందని ఆయన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులు అమలు చేయాలి అన్నారు. ముఖ్య మంత్రి జగన్మోహనరెడ్డి పేదలకు సాగుభూమి పంపిణీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు.సిపిఐ దీర్ఘకాలిక పోరాటం ఫలితంగానే పింఛన్లు పెంచిందని తెలిపారు. అనంతరం స్థానిక సొసైటీ వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్ళి తహశీల్దార్ జె వి సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పుప్పాల కన్న బాబు,కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు, గుడిమూరి పాపారావు, వీరంకి వెంకట్రావు, మానుకొండ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం వంతెన నిర్మాణానికి మార్కింగ్

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఏలూరు ప్రధాన కాలపై వంతెన నిర్మాణానికి మంగళవారం అధికారులు సర్వే చేసి ఎంతవరకు రోడ్డు ఉందో కొలతల ప్రకారం మార్కింగ్ వేశారు. నారాయణపురం వద్ద ఏలూరు ప్రధాన కాలవ పై వంతెన నిర్మాణానికి రూ.8.50 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. నారాయణపురం- ఉండి రాష్ట్ర ఆర్ అండ్ బి రహదారి నారాయణ పురంలో కొల్లేరు ముఖ ద్వారం మైన రహదారి ఎంతో ఉందో అని పలు శాఖ అధికారులు కొలతలు వేసి మార్కింగ్ చేశారు. ఆర్ అండ్ బి, ఇరిగేషన్, డ్రైనేజీ శాఖలకు సంబంధించి భూమి ఎంత ఉంది, అందులో ఆక్రమణలు ఎంతమంది ఉన్నారు, అధికారులు సర్వే చేశారు. ఆక్రమణదారుకు నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాల్సి ఉందని అధికారులు చెప్పారు. ప్రభుత్వ భూమి ఎంత లభ్యత ఉందో దాన్ని బట్టి బ్రిడ్జి డిజైన్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం వంతెన నాలుగు మీటర్ వరకు ఉంది. మొత్తం 12 మీటర్లు వెడల్పు ఉండేటట్లు నిర్మాణం చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో ఆక్రమణదారులు ఆందోళన చెందుతున్నారు. నూతన వంతెన నిర్మాణ పనులు మే నెల వేసవికాలంలో పనులు శ్రీకారం చేస్తారని తెలిసింది.

వదంతులు నమ్మొద్దు

విశాలాంధ్ర -భీమవరం: ఆర్టీసీలో కండక్టర్, డ్రైవర్ల ఉద్యోగాలు అంటూ ఒక వార్త ప్రచారంలోకి వచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని అటువంటి వార్తలు నమ్మొద్దని జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.వీరయ్య చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ఉద్యోగాలు ఎప్పుడు ఇచ్చినా ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ద్వారా తెలియజేయబడుతుందన్నారు. జిల్లాలో ఆశావాహులు చాలామంది తమ కార్యాలయానికి ఫోన్ చేసి ఉద్యోగ నియామకాల గురించి వాకబు చేస్తున్నారని ప్రస్తుతం ఎటువంటి నోటిఫికేషన్లను తమ సంస్థ విడుదల చేయలేదని, దళారీల మాటలు విని ఎవరూ మోసపోవద్దని ఆయన తెలిపారు. ఉద్యోగ నియామకాలు ఎప్పుడూ కూడా బహిరంగంగానే జరుగుతాయని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి పత్రికలలో ప్రకటన ఇచ్చిన తర్వాతనే ఉద్యోగాల కల్పన జరుగుతుందని, ఎవరూ మోసపోవద్దని ఆయన కోరారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి తొలి నామినేషన్

విశాలాంధ్ర-ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం తొలి నామినేషన్ దాఖలైంది. స్వతంత్ర అభ్యర్థిగా పాలకొల్లుకు చెందిన నల్లి రాజేష్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి . అరుణ్ బాబు కు ఒక సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా రెవిన్యూ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి ఏవిఎన్ఎస్ మూర్తి, ప్రభృతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

విశాలాంధ్ర-నూజివీడు : రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతోందని నూజివీడు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు విమర్శిం చారు. మంగళవారం నూజివీడులో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రౌడీయి జంతో భయభ్రాంతులకు గురిచేసి పాలన సాగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.రాష్ట్ర ప్రజలు అంతా గమనిస్తున్నారని రానున్న రోజులలో సరైన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.ప్రతిపక్ష పార్టీలపై దాడులు చేస్తూ పైశాచికానందం పొందుతున్నారని విమర్శించారు.గతంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేశారని,నాయకులు పట్టాభి ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారని ఇప్పుడు గన్నవరం పార్టీ కార్యాలయంపై దాడి చేసి విధ్వంసం సృష్టించారని పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ గుర్తుపై పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యే వంశీ నిజమయిన నాయకుడయితే పదవికి రాజీనామా చేయాలని డిమాండు చేశారు.రానున్న రోజులలో వడ్డీతో సహా అన్నీ తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశం తెలుగుదేశం నాయకులు అక్కినేని చందు,అరికోటి పౌలురాజు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి గ్రస్తులు పోషక ఆహారం తీసుకోవాలి

విశాలాంధ్ర - నిడమర్రు: క్షయ వ్యాధి ఉన్నవారు పోషక ఆహారం తీసుకోవాలని నిడమర్రు మండలం పెదనింద్రకొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కె భాగ్యశ్రీ, డాక్టర్ పి తేజశ్రీ, మంగళవారం అన్నారు. క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా నిడమర్రు మండలం అడవికొలను గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు ఆరోగ్య విస్తరణ అధికారి ఎం. జగ్గారావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 వారాలు మించి దగ్గు, కళ్లె, బరువు తగ్గడం ఆకలి మందగించడం రాత్రులు జ్వరం రావడం లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని అన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలు పాటు పోషక ఆహారం నిమిత్తం రోగులకు రూ. 500 చొప్పున ప్రభుత్వం ఇస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ ఎం పి. వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పి.జయలక్ష్మి, వి. లీల, జి. అంజలి, ఎం. వెంకటలక్ష్మి, ఆశ, వైద్యానికి సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలి



విశాలాంధ్ర-ఉండి: ఈ క్రాప్ నమోదు త్వరితగతిన పూర్తి చేయా లని జిల్లా కలెక్టరు పి .ప్రశాంతి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళ వారం కాళ్ల మండలం దొడ్డనపూడి ,ఆకివీడు మండలం గుమ్ములూరు, ఉండి మండలం కలసిపూడి గ్రామాలలో ఈ క్రాప్ , ఈ కేవైసీ సూపర్ చెక్ రికార్డులను జిల్లా కలెక్టరు పరిశీలించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు , ఈ కేవైసీ ఈ నెల 25 వ తేదీ లోగా పక్కగా పూర్తి చేయాలని, పంట నమోదులో తప్పులు ఉన్న పక్షంలో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు పై చర్యలు తీసుకుంటామన్నారు. ె ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వర రావు, సహాయ సంచాలకులు కె ఏ యస్ యస్ శ్రీనివాస రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: ప్రతి ఒక్కరు మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలని అభ్యుదయ రచయి తల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి ఎన్ సాగర్ పిలుపు నిచ్చారు. స్థానిక శాఖ గ్రంథాల యంలో అరసం ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జా తీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో అనేక భాషలు సంస్కృతులు కనుమరుగవుతున్నాయన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం కారణంగా ఆంధ్రప్రదేశ్ లో మాతృభాషకు మరణ శాసనం రాసినట్లయిందని తెలిపారు. మన మాతృభాషను సంస్కృతిని రక్షించుకోవడానికి ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్రాంతినికేతన్ విద్యార్థులు కళ్యాణి, కార్తిక, అంజలి, సాయి సూర్య విద్యార్థులు దివ్యశ్రీ , పద్మప్రియ విజన్ స్కూల్ విద్యార్థులు కావ్య నాగలక్ష్మి నిత్యశ్రీ, హర్షిత తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు ఆర్ కిషోర్, విజన్ ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్, శ్రీ సాయి సూర్య విద్యాసంస్థల అధినేత కంచర్ల పవన్ కుమార్, పలువురు విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

బొమ్మగాని ధర్మబిక్షం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

విశాలాంధ్ర -భీమవరం: నిజాం ప్రభుత్వానికి వ్యతిరే కంగా తెలంగాణ రైతాంగ పోరాట యోధుడిగా అనేక పోరాటాలు చేసిన గొప్ప పోరాటయోధుడు మాజీ పార్లమెంట్ సభ్యులు, అఖిల భారత గీత, పనివార్ల సంఘం మాజీ అధ్యక్షులు కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని గీత పనివార్ల సంఘ రాష్ట్ర కన్వీనర్ కన్వీనర్ మామిడిశెట్టి లక్ష్మీపతి అన్నారు. కామ్రేడ్ ధర్మభిక్షం శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పాలకోడేరు మండలం వేంద్రలో గీత కార్మికులు ధర్మభిక్షంకు నివాళులర్పించారు. గీత పనివార్ల సంఘ కన్వీనర్ కడలి మృత్యుంజయుడు అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మబిక్షం భూస్వామ్య కుటుంబంలో జన్మించి చిన్నతనంలో నిజాం ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కడలి శంకరం, కామన లక్ష్మీనారాయణ, వీరమల్లు వెంకటకృష్ణ, బొర్రా కృష్ణబాబు, కట్టా నర్సింహారావు, పడమటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దూడల పెంపకంపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - లింగపాలెం : దూడల పెంపకంపై రైతులు అవగాహనతో ఉండాలని పశు వైద్యాధికారులు జేసురత్నం, టి.ఆర్.కె.ప్రసాద్ అన్నారు. ధర్మాజీగూడెం పశువుల ఆసుపత్రిలో దూడల పెంపకంపై పెంపకపుదారులకు మంగళ వారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పలు సూచనలు చేశారు. నేటి లేగదూడలే రేపటి పాడి పశువులని వీరు వివరించారు. దూడలు ఆరోగ్యంపై నిత్యం శ్రద్ధ చూపాలని కోరారు. దూడలపై అధికంగా వెంట్రుకలు ఉన్నా పొట్ట పెరుగుతున్నా తదితర కారణాలు చోటు చేసుకుంటే ఇవి ఆరోగ్యంగా లేనట్టుగా గుర్తించి తగు వైద్యం అందించాలన్నారు. దూడలను శాస్త్రీయ పద్ధతిలో పెంచాలని తెలిపారు. ప్రతీ పెయ్యదూడ ఏడాదిన్నర వయస్సుకు ఎదకు రావాలని వివరించారు. దూడల సంపత్తిని కాపాడేందుకు పెంపకపుదారులకు ప్రోత్సాహం అందించే కార్యక్రమాలను జిల్లాలో నిర్వహిస్తున్నామని అన్నారు. ధర్మాజీగూడెంలో జరిగిన అవగాహన సదస్సుకు పెద్ద సంఖ్యలో దూడలను తీసుకొచ్చారు. ఈ సదస్సులో పశువైద్యులు చైతన్య, ఆదిత్య, శివనాగేంద్ర, సుప్రియ, ఎల్ఆర్కె, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లసముద్రం చెరువు అక్రమ తవ్వకాలపై దర్యాప్తు

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెంలోని మల్లసముద్రం చెరువు మట్టిని అక్రమంగా తవ్వేస్తూ అమ్మేసుకుంటున్న సంఘటనపై సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి పూర్తి స్థాయిలో వివరాలను అందించాలని లింగపాలెం తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణకు ఆదేశాలిచ్చారు. చెరువును అక్రమంగా తవ్వటం వల్ల కట్ట ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సంఘటనలపై విశాలాంధ్రలో ప్రచురించిన కథనాలపై సబ్ కలెక్టర్ స్పందించటంపై రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన మాఫియా ముఠా ఆగడాలను ఇకనైనా అరికడతారని ప్రతీ ఒక్కరు ఆశిస్తున్నారు. మట్టి తవ్వకాలకు అనుమతులు ఇస్తున్న ఉద్యోగుల వివరాలను, వాస్తవ పరిస్థితులను సేకరిస్తున్నట్టు మండల స్థాయి అధికారులు వెల్లడించారు.

బాలికల ఆచూకీ లభ్యం

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెంలో హైస్కూలుకు వెళ్ళిన ఇరువురు బాలికలు అదృశ్యమైన సంఘటనపై స్థానిక ఎస్ఐ చెన్నారావు తన సిబ్బందితో కలిసి 24 గంటలలోపే పట్టుకున్నారు. వీరిరువురు స్కూలు నుంచి వెళ్ళటంతో ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. వీరి అదృశ్యాన్ని చేధించిన ఎస్ఐని, సిబ్బందిని బాలికల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు. వీరు ఎలా వెళ్ళారనే దానిపై దర్యాప్తు సాగుతుందని ఎస్ఐ తెలిపారు. బాలికల ఆచూకీ కనుగొనటంతో సస్పెన్స్‌కు తెరపడి అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఆస్తి పన్నులు చెల్లించని షాపులు సీజ్

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఆస్తి పన్నులు చెల్లించని వారిపై మున్సిపల్ అధికారులు కొరడా ఝళిపిస్తూనే ఉన్నారు.మంగళవారం ఆస్తి పన్నులు వసూలు చేసే కార్యక్రమంలో భాగంగా స్థానిక బోసుబొమ్మ సెంటర్ వద్ద ఉన్న పాత శ్రీనివాసా రెడిమేడ్ కాంప్లెక్స్ లో ఉన్న ఎస్.ఎస్. జ్యూయలరీస్,రాజస్థాన్ టీ స్టాల్,దేవీ త్రినేత్ర ఫ్యాన్సీ షాపులకు మున్సిపల్ కమీషనర్ పి భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో తాళాలు వేసి షాపులు సీజ్ చేశారు. ఆ కాంప్లెక్స్ కు సంబంధించి రూ.5లక్షల 35 వేల 340లు మాత్రమే పన్ను బకాయి ఉందని ఆ బకాయి వెంటనే చెల్లిస్తామని, షాపు లు తెరిపించాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు కమీషనర్ ను అడిగారు. ఆ కాంప్లెక్స్ యజమాని కి పట్టణంలో వివిధ ఆస్తులకు సంబంధించి సుమారు రూ.42లక్షలకు పైగా బకాయి ఉందని అది మొత్తం చెల్లిస్తే కానీ షాపులు ఓపెన్ చెయ్యమని కమిషనర్ తేల్చి చెప్పారు.ఎంత చెల్లించాలన్నా ఆ యజమాని చెక్ ద్వారా గానీ నగదు గానీ ఇవ్వాలని తెలిపారు .ఈ విషయం పై ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వందనపు మాట్లాడుతూ కాంప్లెక్స్ యజమాని అందుబాటులో లేరని,సీజ్ చేసిన బంగారం షాప్ లో పెళ్లిళ్లకు ఆర్డర్ లు ఇచ్చిన మంగళ సూత్రాలున్నాయని అందువల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా బంగారం షాప్ ఓపెన్ చేయాలని ,ఆ కాంప్లెక్స్ కు మాత్రమే ఉన్న బకాయి తాము చెల్లిస్తామని చెప్పినా కమిషనర్ ఒప్పుకోక పోవడంతో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వ్యాపారులు మున్సిపల్ కమీషనర్ కారును కదలకుండా రోడ్డుపై బైఠాయించారు.వ్యాపారులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. దీంతో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావుకు,కమిషనర్‌కు కొద్దిసేపు వాగ్వాదం జరిగింది.డ్యూటీ లో ఉన్న అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తున్న వ్యాపారులపై కమిషనర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ బాల సురేష్ బాబు,ఎస్ ఐ సాగర్ బాబు బోసు బొమ్మ సెంటర్ కు చేరుకుని వ్యాపారులతో చర్చించారు. వందనపు వెంకటేశ్వరరావు తడికమళ్ళశేఖర్, పి.పి.ఎస్.చంద్రరావు, కంచర్ల విష్ణు తదితరులు కమీషనర్ తో సుదీర్ఘ చర్చల అనంతరం పాత శ్రీనివాసా రెడీమేడ్ కాంప్లెక్స్ కు ఉన్న బకాయి రూ .5లక్షల 35వేల 340లు నగదు రూపంలో కమిషనర్ కు అందచేయడంతో అధికారులు షాపులు తెరిచారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-భీమడోలు: భీమడోలు మండలంలో మంగళవారం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలుత భీమడోలులో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటరును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన సత్వర వైద్య సేవలు అందించ డానికి డాక్టర్లు కృషి చేయాలన్నారు. ఈ తనిఖీలో భాగంగా హెల్త్ సెంటర్ లో ఉన్న వార్డులను, ప్రసూతి గది, డెలివరీ థియేటర్, మేజర్ ఆపరేషన్ థియేటర్, కట్లు కట్టే విభాగం, మందులు ఇచ్చే విభాగం, లేబరేటరీ, రక్తపరీక్షా విభాగం, మెడికల్ రూమ్, టాయిలెట్స్, కంటి విభాగాన్ని పరిశీలించారు. వార్డుల్లో ఉన్న బెడ్ షీట్లను రోజూ మార్చాలని, రబ్బరు బెడ్ షీట్లను పరిశీలించి కొత్త రబ్బరు బెడ్ షీట్లను ఏర్పాటు చేయాలని డాక్టర్ శ్వేతను ఆదేశించారు. రోజువారీ ఆసుపత్రికి వచ్చే రోగుల ఓపిని హాజరు రిజిష్టరును పరిశీలించారు. వార్డుల్లో ఉన్న రోగుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సేవలను ఆయన ఆరా తీశారు. డ్యూటీలో సమయంలో ఖచ్చితంగా మెడికల్ ఆఫీసరు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం కురెళ్లగూడెం, పాతూరు రైతు భరోసా కేంద్రాల ను ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రైతులతో వ్యవసాయ సంబంధ అంశాలపై ముఖా ముఖీగా చర్చించారు. టార్పాలిన్స్ సబ్సిడీపై ఇప్పించే ఏర్పాటు చేయాలని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాఘవన్, డిప్యూటీ తహశీల్దార్ షంషీద్దీన్, వ్యవసాయశాఖ ఏడిఏ ఉషారాజకుమారి, ఎఓ ఉషారాణి, ఆర్ బి కె. అసిస్టెంట్లు సాయిలీ దీపిక, కె. భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 10వేల జీతం ఇవ్వాలి

విశాలాంధ్ర-చింతలపూడి: మధ్యాహ్న భోజనం వంట కార్మికులకు నెలకు రూ.10వేలు జీతం ఇవ్వాలని మధ్యాహ్నం భోజనం పథకం (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చి బాబు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి,ఎంఇవో రామరావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ వంటకు గ్యాస్ ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు.ఒక్కో విద్యార్థికి రూ.20లు చెల్లించాలని, వంట కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పియఫ్,ఇయస్ఐ అమలు చేయాలన్నారు.వంట కార్మికులకు వంట పాత్రలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం పథకం మండల అధ్యక్షులు షేక్ ఫకీరమ్మ, ధారవతు లక్ష్మిమరియమ్మ తథితరులు పాల్గొన్నారు.

సర్వే రాళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రీ సర్వే పూర్తి అయిన భూములలో సర్వే రాళ్లను వేసే ప్రక్రియ వేగ వంతం చేయాలని జంగారెడ్డిగూడెం ఆర్ డి ఓ ఝాన్సీ రాణి మండల అధికారులకు సూచిం చారు. కొయ్యల గూడెంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆర్డీవో ఝాన్సీ రాణి, తహసీల్దార్, ఎంపీ డివో, ఎన్ఆర్ఈజీఎస్ ఏవో, మండల రెవెన్యూ సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 13 గ్రామాలలో రీసర్వే పూర్తి అయ్యిందని రాజవరం గ్రామం మినహా 12 గ్రామాలకు 22 వేల సర్వే రాళ్లను ప్రభుత్వం ఉచితంగా అందించిందని రిసర్వే పూర్తి అయిన భూములలో ప్రభుత్వం ఉచితంగా అందచేస్తున్న రాళ్లను సరిహద్దులలో ఉపాధి హామీ కూలీల ద్వారా నాటించాలని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పి. నాగమణి, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఎనర్జీ ఎస్ ఏపీఓ నాగేశ్వరరావు, కొయ్యలగూడెం మండల రెవెన్యూ సర్వేయర్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పశువుల చెరువు చేపల చెరువుగా మార్చొద్దు



విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కొత్తపల్లి- సరిపల్లి గ్రామాల మధ్యలో ఉన్న దంతుల కుంట పశువుల చెరువు చేపల చెరువులుగా మార్చవద్దని గణపవరం గ్రామానికి చెందిన రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి సభ్యులు, వరి పండించే రైతు రుద్రరాజు వెంకట సూర్యనారాయణ రాజు(ఆర్ వి ఎస్ రాజు) మంగళవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆ చెరువుకు పడమర ఉన్న వరి మాగాణి భూములు ఊబి భూములుగా మారుతున్నాయని దాని ద్వారా వరి పండించే రైతుకు నష్టాలు పాలవుతున్నాడని ఆయన అన్నారు. జంతువులకు, పశువులకు త్రాగునీరు అందించడానికి అప్పట్లో నూజివీడు జమిందార్ దొంతులకుంట చెరువును బహూకరించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ విషయంపై సోమవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. గతంలో గణపవరం మండలస్థాయి అధికారులకు, కొత్తపల్లి పంచాయతీ వారికి వినతి పత్రాలు ఇచ్చిన ప్రయోజనం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ చెరువు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ వి ఎస్ రాజు కోరారు.

రాష్ట్రంలో రాష్ట్రపతి పరిపాలన విధించాలి

విశాలాంధ్ర -నూజివీడు టౌన్: రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ కు తక్షణం రాష్ట్రపతి పాలన విధించాలని నూజివీడు నియోజకవర్గ టీడిపి ఇంచార్జ్ మాజీ శాసన సభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు డిమాండ్ చేసారు. మంగళవారం స్థానిక టీడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతలు పరిరక్షించాల్సిన పోలీస్ అధికార పార్టీకి తొత్తులుగా మారారన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించడంతోపాటు నిరంతరం ప్రతిపక్ష నాయకుల పైన కార్యాలయాల పైన దాడులకు తెగబడుతుంటే అడ్డుకోవలసిన పోలీస్ వ్యవస్థ వైసిపి రౌడీ మూకలకు తోడ్పాటు నందిస్తోందన్నారు. గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం పైన జరిగిన దాడుల్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీలో గెలిచి తెలుగుదేశం పార్టీ పదవులను అనుభవిస్తున్న వంశీ చేతనైతే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలన్నారు.

జంగారెడ్డిగూడెంలో నకిలీ 2వేల నోట్ల కలకలం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలో నకిలీ 2వేల నోట్ల వ్యవహారం కలకలం రేపుతోంది.ఈ వ్యవహారంపై పోలీసులు నిఘా పెట్టారు. స్థానిక ఎస్ఐ సాగర్ బాబు తన సిబ్బందితో పట్టణంలో దాడి చేశారు. ఈ దాడిలో మండపాటి రాజా, కోడూరి రవితేజ పారిపోయారని, కాట్రు వంశీ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి నుండి రూ. 40లక్షల విలువైన 2వేల నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.లక్ష ఒరిజినల్ నోట్లు ఇస్తే రెండు లేదా మూడు లక్షల దొంగ నోట్లు ఇస్తామని చెప్పి కొందరిని నమ్మించి డబ్బు ఇచ్చే సమయంలో పోలీసులు వస్తున్నారని భయపెట్టి అసలు,దొంగ నోట్లను తీసుకుని పారిపోయే ముఠాగా వీరిని గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.ఈ ముఠా వల్ల నష్ట పోయిన బాధితులు స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే మోసం చేసిన ముఠాను పట్టుకుంటామని ఆయన తెలిపారు.కేసు నమోదు చేసి పూర్తి వివరాలు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ బాబు తెలిపారు.

38,483 ఎకరాలలో అపరాల సాగు

విశాలాంధ్ర -ఏలూరు : ఏలూరు జిల్లాలో 38,483 ఎకరాలలో అపరాలు సాగు చేస్తూ ఈ క్రాప్ నమోదు చేయటం జరిగిందని జిల్లా వ్యయసాయాధికారి వై.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు.7 మండలాలలో ఏలూరు, పెదపాడు, దెందులూరు, కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి అపరాలు అధికంగా సాగు చేసినట్టు తెలిపారు. నాఫెడ్ సంస్థ ద్వారా మార్క్ ఫెడ్ ఏలూరు కొనుగోలు కేంద్రాలను మండలానికి ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఎంపిక చేసి అన్ని రైతు భరోసా కేంద్రాలను దానికి అనుసంధానం చేయటం పూర్తి అయ్యిందన్నారు మండలంలో ఎంపిక చేయబడిన రైతు భరోసా కేంద్రాలను సొసైటీల సహకారంతో ఈనెల 25వ తేదీ నుండి ఏలూరు జిల్లాలో అపరాలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కైకరం పదోతరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తాడేపల్లిగూడెంకి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ మోహనరావు విద్యార్థుల విజయసాధనా సోపానాలు సోదా హరణంగా ఆసక్తిదాయకంగా వివరించారు. విద్యార్థుల వినయ విధేయతలు, పట్టుదల, నిబద్ధత విజయాలకు మూలమన్నారు. ముఖ్య అతిథి మానవత సంస్థ రీజినల్ ఛైర్మెన్ పుప్పాల గోపీ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణులు కావడానికి ఈ వ్యక్తిత్వ వికాస శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమానికి హెచ్ ఎం చేబ్రోలు శ్రీనివాస్ కుమార్ అధ్యక్షత వహిస్తూ మానవత సేవలు అపురూపమైనవని, పాఠశాల లో వ్యక్తిత్వ శిక్షణ ఏర్పాటు చేయడం ఉత్తమ ఫలితాలు సాధించడానికి దోహదపడు తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానవత ఉంగుటూరు మండలం అధ్యక్షులు పి సూర్యనారాయణ రాజు, మానవత్వం మండల ప్రధాన కార్యదర్శి గంజి రవి కుమార్,కోనే వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ గూండాల దాడి అప్రజాస్వామికం

విశాలాంధ్ర - ఏలూరు : కృష్ణాజిల్లా గన్నవరం టిడిపి కార్యాలయం పై వైసీపీ గూండాల దాడి అప్రజాస్వామిక మని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల జనసేన పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు ఖండిం చారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి పరిపాలనలో ప్రజలు ప్రజాస్వామ్య పరిపాలనలో ఉన్నారా..? లేక గుండాల పరిపాలన ఉన్నారా అనేది గన్నవరం టిడిపి కార్యాలయంపై,వైసిపి గుండాల దాడి ప్రస్ఫుటం చేస్తోందన్నారు. పార్టీ కార్యాలయం అంటే, దేవాలయం లాంటిదని ఒక అసెంబ్లీ, ఓ పార్లమెంట్ భవనం లాంటిదని, ఇటువంటి పార్టీ కార్యాలయాలపై దాడులకు తెగబడి, కార్యాలయాలను, అక్కడున్న వాహనాలను తగులబెట్టి, పార్టీ కార్యకర్తలపై దాడులకు పాల్పడి,ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా జగన్ పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు.

పెద్దింట్లమ్మ మహోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర- కైకలూరు: కొల్లేటికోట శ్రీ పెద్దింటి అమ్మవారి జాతక మహోత్స వాలను శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. తొలుత ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పులవర్తి లక్ష్మణ్, ఈవో కందుల వేణుగోపాల రావు, ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరరావు ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డిఎన్ఆర్ దంపతులను, మాజీ శాసనసభ్యులు జయ మంగళ వెంకటరమణ, రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ సైదు గాయత్రీ సంతోషి, కైకలూరు జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యురాలు కురెళ్ళ బేబీలను దుశ్శాలువాలు, పూలమాలలతో స్వాగతించారు. అనంతరం శ్రీపెద్దింటి అమ్మవారిని దర్శించుకుని అర్చక స్వాముల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి వార్షిక జాతర మహోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండవల్లి మండల జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజవర్గ సభ్యురాలు ముంగర విజయనిర్మల, సర్పంచులు జయమంగళ కాసులు, బత్తిన ఉమామహేశ్వరరావు, సైదు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు బలే నరేష్, ఘంటసాల నాగమణి,దేవస్థాన పాలక మండల సభ్యులు మద్దాల సుబ్బలక్ష్మి, ఉడిముడి సుబ్బరాజు,భలే సుజాత, కలిదిండి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నీలపాల వెంకటేశ్వరరావు, రూరల్ సీఐ వైవివిఎల్ నాయుడు, ఎంపీడీవో రామలింగేశ్వర రావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడి చేస్తారా?

విశాలాంధ్ర -ఏలూరు : రాష్ట్రంలో వైసీపీప్రభుత్వం అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తే గన్నవరం టిడిపి కార్యాలయం పై దాడి చేస్తారా అని టిడిపి ఎస్సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎస్సి ,ఎస్టి, బీసీ, మైనార్టీ, టిడిపి నేతలపై దాడులు చేస్తూ, అక్రమ అరెస్టులు బనాయిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. గన్నవరం టిడిపి కార్యాలయం దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి దాడులను ప్రజలు ఎప్పటికీ హర్షించరని ప్రజలు గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల సమయంలో ప్రజలే ప్రభుత్వానికి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్తారన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: దివంగతురాలైన తన సతీమణి సుజాత జ్ఞాపకార్థం స్థానికులు కొటికలపూడి పురుషోత్తం(హరి) హౌసింగ్ బోర్డులోని 35వ వార్డు మునిసిపల్ ప్రాథ మిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం నోటు పుస్తకా లను పంపిణీ చేశారు. పాఠశా లలో చదువుతున్న మొత్తం 60 మంది విద్యార్థు లకు నోటుపుస్తకా లను అందచేసారు. గతంలో కూడా ఆయన పలు సందర్భాల్లో స్థానిక పాఠశా లల్లో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఆయన కుమార్తె వేదాంజలి, ప్రధానోపా ధ్యాయుడు ఎస్. జవహర్, ఉపాధ్యాయిని జి.పార్వతీ దేవి పాల్గొన్నారు.

ఒరిజినల్ లింకుదస్తావేజు పోయినది

సతరబోయిన శ్రీను, S/o. సతరబోయిన ఆంజనేయులు, D.No.:22-8-11రు, కురిశేటివారి వీధి, భీమవరం పట్టణం, భీమవరం(మం), ప॥గో॥ జిల్లా., **ది.01-10-2022వ** తేదీన భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయబడిన **దస్తావేజు నెం:4035/2022కు** సంబంధించి ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయబడిన **ఒరిజినల్ లింకు దస్తావేజు నెం:4997/2017ను ది.10-02-2023వ** తేదీన భీమవరం తాలూకా ఆఫీస్ సెంటర్ వద్ద జిరాక్స్ తీయించుకుని మోటార్ సైకిల్ పై మా ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో పోయినవి. పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా నా యొక్క ఒరిజినల్ లింకు దస్తావేజు కనిపించలేదు. దయచేసి నా యొక్క ఒరిజినల్ లింకు దస్తావేజు దొరికిన వారు క్రింద అడ్రసులో అందచేయగలరు.

సతరబోయిన శ్రీను,
S/o. సతరబోయిన అంజనేయులు,
D.No.:22-8-11రు, కురిశేటి వారి వీధి,
భీమవరం పట్టణం,
భీమవరం (మం), ప॥గో॥జిల్లా.,

వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేయాలి

విశాలాంధ్ర - ముదినేపల్లి : వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేయాలని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దావు నాగరాజు పేర్కొన్నారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శ్రీహరిపురం, కాకరవాడ, కోమర్రు, దేవపూడి గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ లేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. వైసీపీకి గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. టిడిపి రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, నాయకులు పంతగాని సురేష్, బొంగు రవికుమార్, తిరుమలశెట్టి సాంబశివరావు, సిహెచ్ శివకుమార్, రెడ్డి నాగరాజు, కత్తే సుధీర్, కాటూరి స్వామి, కొత్తూరి చిట్టిబాబు, నీలం రమేష్ ,కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర -కైకలూరు : గ్రామ సచివాలయ స్థాయిలో పార్టీ పటిష్టత కోసం గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కష్టించి పని చేయాలని కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కైకలూరు సీతారామ ఫంక్షన్ హాల్లో మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఎమ్మెల్యే డిఎన్ఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి... వాలంటీర్లు నూటికి నూరు శాతం ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నారని వారు ప్రభుత్వ కార్యక్రమాలు చూస్తుండగా వారికి అటు ఇటుగా గృహసారథులు వారికి కేటాయించిన కుటుంబాలలో పార్టీ కోసం జగనన్న కోసం పనిచేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని అన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అన్న భరోసా ప్రజలందరిలో కలిగించాలని అన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామ సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు పార్టీ ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని ఎమ్మెల్యే డిఎన్ఆర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీ రామ దుర్గాప్రసాద్,జడ్పీటిసి సభ్యురాలు కురేళ్ల బేబీ,మండల వైసీపీ అధ్యక్షులు బత్రాజు శివాజీ,మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, సర్పంచ్లు డిఎం. నవరత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాయకుదురు విద్యార్థినికి ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డ్స్

విశాలాంధ్ర- వీరవాసరం: నేటి బాలబాలికల్లో దేశభక్తిని, మన దేశ సంస్కృతి, సంప్రదాయా లను చిన్నతనం నుండి అలవర్చి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని విజ్డమ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ అనుమాండ్ల నాగరాజు తెలిపారు. గత నెలలో ఆన్లైన్ లో జరిగిన దేశభక్తి గీతాల పాటల పోటీలలో మండలం లోని రాయకుదురుకు చెందిన నార్కెడిమిల్లి శ్రీశాశ్వత ప్రథమ బహుమతి గా ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డ్స్ 2023ను గెలుపొందింది. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని విజ్డమ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం రవీంద్ర భారతిలో నార్కెడిమిల్లి శ్రీ శాశ్వతకు ప్రముఖుల సమక్షంలో అవార్డును ప్రధానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు చిన్నతనం నుండి మన సంస్కృతి, సాంప్రదాయాలను, దేశ ఔన్నత్యాన్ని వివరించాలని సూచించారు. శ్రీశాశ్వత తల్లిదండ్రులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

విశాలాంధ్ర-వీరవాసరం: అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బాలేపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మూడు కుటుంబా లకు చెందిన పడవల సత్యనారాయణ, పడవల దాసు, పొలమూరు నాగరత్నం లు నిరాశ్ర యులు కావడంతో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి వారిని పరామర్శించారు. ప్రమాదం ఏ విధంగా జరిగింది అనే దానిపై ఆరా తీశారు. అనంతరం బాధిత కుటుంబాలకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా బాధితులను ఆదుకుంటామని, ప్రభుత్వ గృహాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి శ్రీనివాస్, గ్రామ ఉప సర్పంచ్ కాటిక విజయనిర్మల, మండల పార్టీ అధ్యక్షులు, బొబ్బనపల్లి గ్రామ సర్పంచ్ గూడూరి ఓంకార్, వీరవాసరం సర్పంచ్ చికిలే మంగతాయారు తదితరులున్నారు.

మాతృ భాషలో నైపుణ్యం సాధించాలి

విశాలాంధ్ర -భీమవరం: మాతృ భాషలో నైపుణ్యం, ప్రావీణ్యం వ్యక్తి వికాసానికి మనుగడకు దోహదం చేస్తాయని ప్రముఖ పద్య కవి తియాదుల అప్పన్న అన్నారు. ఆర్.ఆర్.డి.ఎస్. ప్రభుత్వ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం తెలుగు విభాగం అధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ మాతృ భాషలో సాహిత్యం అధ్యయనం చేయడం ద్వారా మానసికంగాను, సాహిత్యం పరంగాను ప్రతిభ కనపరుస్తారన్నారు. ప్రతి ఒక్కరూ మాతృ భాషలో పట్టు సాధించాలని ఆయన కోరారు. అనంతరం ఆయన సమకాలీనాంశలపై పద్య కవిత్వం వినిపించి పద్య గేయాలు ఆలపించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతం, డాక్టర్ అరవింద స్వామి, డాక్టర్ పి.రాజశేఖర్, జి.ఉమామహేశ్వరి, సత్యనారాయణ, పి.అమూల్యరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం : గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భిణీ స్త్రీలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసినట్లు డివిజనల్ ఇన్ చార్జి వైద్యాధికారి డాక్టర్ జోషిరాయి మంగళవారం అన్నారు. జిల్లా వైద్యాధిక శాఖ అధికారుల ఆదేశాల మేరకు గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గణపవరం పి హెచ్ సి వైద్యాధికారులు డాక్టర్ పిహెచ్ ఆర్ సంతోష్ నాయుడు, డాక్టర్ పి కిరణ్మయిలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కమ్యూనిటీ హెల్త్ అధికారి జె. విల్సన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ బి శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు ఎం ఎస్ యోహన్, కృష్ణ ,శ్రీను, జి వరలక్ష్మి, సుహాసిని ,పద్మరాగం వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడి మృతిపై విచారం

విశాలాంధ్ర - లింగపాలెం : హైదరాబాద్లో నాలుగేళ్ళ బాలుడిపై కుక్కలు దాడి చేసి మృతికి కారణమైన సంఘటనపై ప్రతీ ఒక్కరు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఎక్కడ జరిగిందేది అలా ఉంచితే జరిగిన సంఘటన మీడియా, యూట్యూబ్ చానళ్ళలో రావటం దీనిని చూసిన ప్రతీ ఒక్కరూ ఆవేదన చెందుతున్నారు. బుడిబుడి అడుగులు వేసుకుంటూ వెళ్ళే చిన్నారి బాలుడిపై కుక్కలు దాడి చేయటాన్ని మనసున్న ప్రతీ ఒక్కరి హృదయాన్ని కలచివేస్తుంది. గ్రామాలలో కుక్కలు బెడద తీవ్రంగా ఉంది. లింగపాలెం మండలంలో ప్రతీ ఊరిలో అడుగడుగుకు కుక్కలు ఉన్నాయి. వీటి దాడికి ప్రతీ రోజు ఎందరో గురవుతున్నారు. రాత్రి సమయాలలో ఒక్కరే బయటకు రాలేని పరిస్థితి. ద్విచక్ర వాహనాలపై వెళ్ళే వారిపై వీటి దాడులు అధికమవుతున్నాయి. కుక్కల ప్రేమికులు ఇటువంటి దారుణమైన సంఘటనలకు ఏం సమాధానం చెబుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు పిల్లలను బయటకు పంపటానికి తల్లిదండ్రులు బేజారెత్తుతున్నారు.

తెలుగు జంట పదాలు లాంటి వారే కవలలు

నేడు ప్రపంచ కవలల దినోత్సవం

విశాలాంధ్ర - కొత్తపేట : సృష్టిలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని మన పెద్దలు చెప్పేవారు. కవల పిల్లలను చూస్తే ఆ విషయం నమ్మవచ్చని అనిపిస్తుంది. రామాయణ కాలం నుండే ఈ కవలల గురించి పురాణాల ద్వారా మనం వింటున్నాము. రామ-లక్ష్మణులు పేర్ల మాదిరే మన వాళ్ళు కవల పిల్లలకు రామలక్ష్మణులు అని పేర్లు పెట్టేవారు. తొలిసారి 1976 సంవత్సరం ఫిబ్రవరి 22వ తేదీన ప్రపంచ కవలల దినోత్సవంగా నిర్వహించారు. అప్పటి నుండి ఆ వేడుక నిర్వహిస్తున్నారు. ఇది చాలా గొప్ప విషయం. కొత్తపేట గ్రామానికి చెందిన వర్షిని, వర్ధిని తెలుగుదేశం నాయకులు గుబ్బల మూర్తి-ఝాన్సీ దంపతులకు కవలల సంతానం. ఒకే కాన్పులో ఇద్దరూ పిల్లలు జన్మిస్తే ఆ ఇద్దరు పిల్లలను కవలలు అంటారు. వీళ్ల పోలికలు ఒకేలా ఉంటే మోనోజోగోటెక్ అని, పోలికలు వేరేగా ఉంటే డైజోగోటిక్ అంటారు. పురాణాలలో కవలలు రామాయణంలో లవకుశలు, మహాభారతంలో పాండురాజు కుమారులు నకులుడు, సహదేవుడుగా పిలవబడే వారు. కవల పిల్లలు కలిగిన తల్లిని ఉదయాన్నే చూస్తే ఎంతో మంచి జరుగుతుందని పెద్దలు అంటారు. కవల పిల్లలను చూస్తే ప్రతి ఒక్కరి మనసుకు ఎంతో ఆనందం. అటువంటి కవల పిల్లలను కన్న తల్లిదండ్రులకు ఎంత ఆనందమో చెప్పగలమా. కవలలు వర్షిని, వర్ధిని కొత్తపేట భాష్యం స్కూలులో 9వ తరగతి చదువుతున్నారు. ఈ కవల పిల్లలను చూసి ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు స్థానికులు మురిసిపోతారు.

విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర - లింగపాలెం : రంగాపురంలో పదవ తరగతి చదువుతున్న కొండలపల్లి జ్యోత్స్న రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞాన ప్రదర్శనకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో ఈనెల 20, 21 తేదీల్లో జరిగిన ప్రదర్శనలో గణితాన్ని సులభంగా నేర్చుకునే విధానంపై ప్రదర్శన నిర్వహించటంతో జ్యోత్స్నకు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి వచ్చింది. అంతేకాకుండా ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞాన ప్రదర్శనకు ఎంపిక చేశారు. పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రతిభ చూపటంతో ప్రధానోపాధ్యాయులు వెంకటరత్నం, ఉపాధ్యాయులు, సిఆర్పి రవి, సహచర విద్యార్థులు అభినందించారు.

రాష్ట్రంలో వైసీపీ గుండాల పాలన

విశాలాంధ్ర - బుట్టాయగూడెం: ప్రజా సమస్యలపై పోరాడుతూ, వైసీపీ నాయకుల అవినీతి పై ప్రశ్నిస్తే రౌడీ మూకలతో దాడులు చేయించడం హేయమైన చర్యని పోలవరం నియోజవర్గ టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సింగన్నపల్లి కాలనీ వద్ద ఉన్న ఆయన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి గన్నవరం కార్యాలయంలో వైసిపి గుండాలు చొరబడి విధ్వంసం సృష్టించి కార్యకర్తల పై దాడి చేసి, వాహనాలు తగలపెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోలీసుల సమక్షంలో వైసిపి అల్లరి మూకలు రెచ్చిపోయి గుండాల్లా దాడులకు దిగితే చూస్తూ ఉండిపోవడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వం గూండాలను, రౌడీలను పెంచి పోషిస్తూ దాడులు చేయించడంలో చరిత్ర సృష్టిస్తుందన్నారు. జగన్ రెడ్డి చేతకాని పరిపాలన వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు.దాడులు చేసిన వారిపై కేసులు పెట్టాల్సిన పోలీసులు, టిడిపి వారిపై కేసులు పెట్టడం నీతిమాలిన చర్యన్నారు ఈ కార్యక్రమంలో ఐ టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు ఎస్ సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ఎస్సీ సెల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మనెల్లి బాలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు గృహ నిర్బంధం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: గన్నవరం టిడిపి కార్యాలయంపై సోమవారం వైసిపి కార్యకర్తలు దాడి చేసి వాహనాలు దగ్ధం చేసి దాడులు చేస్తే వారిపై కేసులు పెట్టి వారిని అరెస్టు చేయకుండా బాధితులైన టీడీపీ నేతల పైనే కేసులు పెట్టి అరెస్టు చేయడం అత్యంత దారుణం అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు ఆవేదన వ్యక్తం చేశారు.గన్నవరం వెళ్తారనే ఉద్దేశ్యంతో పోలీసులు మండలంలోని శ్రీనివాసపురం లో శేషు స్వగృహంలో అరెస్ట్ చేశారు. దీనిపై శేషు స్పందిస్తూ పోలీసులు అకారణంగా హౌస్ అరెస్టులు చేయడం అత్యంత దారుణం అన్నారు.ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన హక్కు ఏ వ్యక్తి అయినా ఎక్కడికైనా పర్యటించే సౌలభ్యం ఉందన్నారు.కానీ ఈప్రభుత్వంలో పోలీసులను అడ్డంపెట్టుకుని ప్రాథమిక హక్కులను సైతం కాలరాస్తుందని,ఇది నియంత ప్రభుత్వం అని ఈప్రభుత్వానికి రానున్న రోజుల్లో పతనం ఖాయం అని శేషు అన్నారు.హౌస్ అరెస్ట్ అయినవారిలో టిడిపి బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వర రావు, మండల తెలుగుయువత ఉపాధ్యక్షుడు తడికల మోహన్, నేతలు వీరమల్ల పోసుబాబు, పులపాకుల విజయ్ తదితరులు ఉన్నారు.

115 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఐసీర్ వ్యాన్ను పట్టుకున్నట్లు విజిలెన్స్ సిఐ శివరామకృష్ణ తెలిపారు. మంగళవారం దర్భ గూడెం గిరిజన కార్పొరేషన్ రేషన్ డీలర్ సత్యవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీనివాస రావు తో పాటు మరో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. రేషన్ బియ్యం, వ్యాన్ కలిపి రూ.13 లక్షలు విలువ ఉంటుందన్నారు. ఈ విజిలెన్స్ దాడిలో సివిల్ సప్లై డిటి శ్రీనివాసరావు, దర్భగూడెం విఆర్ఓ పాషా సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో ఫ్యామిలీ గ్లోరీ

విశాలాంధ్ర -ఏలూరు : కుటుంబ సంబంధాలు ప్రాముఖ్యతను తెలియజేసేందుకే ఫ్యామిలీ గౌరీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని శ్రీ చైతన్య ప్రధానోపాధ్యాయులు శివకుమారి అన్నారు.స్థానిక శాంతినగర్ శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారవంతమైన భవిష్యత్తును నిర్మించుకునేందకు సహకరించే నైతిక విలువలు అలవర్చుకొనేలా శ్రీ చైతన్య విద్యా సంస్థలు ప్రతిష్టాత్మకంగా " ఫ్యామిలీ గ్లోరి " పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని 10 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి దశ నుండి వారి అనుభవాలను, కుటుంబ సంబంధాలకు ఇచ్చే ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించారు. ఈ సందర్భంగా 9వతరగతి విద్యార్థులచే వారి తల్లిదండ్రులకు, ఇతర కుటుంబ పెద్దలకు ప్రత్యేక సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎకడమిక్ డీన్ జాల సంజీవ్ కుమార్, ప్రీ ప్రైమరీ జోనల్ కోఆర్డినేటర్ షమ్మీ బేగం, అధ్యాపక అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు.

ఈఈఎంటీ పరీక్షలలో జిల్లాలో ద్వితీయస్థానం సాధించిన వెదిరేశ్వరం విద్యార్థి

విశాలాంధ్ర - రావులపాలెం : ఇటీవల జరిగిన ఎడ్యుకేషనల్ ఎఫినిటీ మెరిట్ టెస్ట్ (ఈఈఎంటీ)లో రావులపాలెం మండలం వెదిరేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎస్. వివేక్ సాయితేజ వర్మ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ద్వితీయ స్థానం సాధించాడని ప్రధానోపాధ్యాయురాలు వి. సత్యశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి, తల్లిదండ్రులను సర్పంచ్ బొక్కా కరుణాకరం, వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఎంఈఓ ఎం హరిప్రసాద్, విద్యా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు అభినందించారు.

జనసేన సభ్యత్వంతో ప్రయోజనం

విశాలాంధ్ర - కాట్రేనికోన : ప్రతి ఒక్కరు జనసేన క్రియాశీలక సభ్యత్వాలు తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుందని రాష్ట్ర జనసేన పార్టీ పీఏసీ సభ్యులు, ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్చార్జ్ పితాని బాలకృష్ణ అన్నారు. మంగళవారం కాట్రేనికోన మండలం, బలుసుతిప్ప గ్రామంలో పర్యటించిన ఆయన జనసేన సభ్యులకు భీమా సౌకర్యం ఉండటం వల్ల ఆపదలో ఆదుకుంటుందని తెలిపారు. పార్టీ అండగా ఉండడమే కాకుండా రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టి అందరికీ సేవలు అందిస్తామని పితాని అన్నారు. ఇటీవల ప్రమాదానికి గురై దెబ్బలు తగిలిన పెమ్మాడి ఆదినారాయణను ఇంటికి వెళ్లి పరామర్శించారు. క్యాన్సర్ వ్యాధితోబాధపడుతున్న ఓలేటి శ్రీను అన్న కుమారుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట కాట్రేనికోన మండల పార్టీ అధ్యక్షులు మోకా బాల ప్రసాద్, నాయకులు నూకల శ్రీరామదుర్గ, మండల కార్యదర్శి పిల్లి గోపి, బీమాల సూర్య నాయుడు, గిడ్డి రత్నశ్రీ, సంగాని ధర్మారావు, పెమ్మడి శీను, ఓలేటి శ్రీను, డొక్కాడి రాంబాబు, దండుప్రోలు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'వికాస'లో 23న జాబ్ డ్రైవ్

విశాలాంధ్ర - కాకినాడ : 'వికాస' కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ గురువారం జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ జాబ్లో డ్రైవ్లో ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో టెలికాలర్, జూనియర్ రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్, పిఒ ఉద్యోగానికి ఏదైనా డిగ్రీ, ఎంబిఏ ఉత్తీర్ణులైన 30 సం.లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.16,000/- నుండి రూ.20,000/ జీతం ఉంటుంది. డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్) ఉద్యోగానికి బిఎస్సి కెమిస్ట్రీ, బిజెడ్సి, ఎంపిసి & సిబిజెడ్ గ్రూప్లు 2017 నుండి 2022 సం.ల్లో ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.17,000/- జీతం + భోజనం, వసతి మరియు రవాణా సౌకర్యం ఉంటుంది. ఐసాన్ ఎక్స్పీరియన్స్ కంపెనీలో కస్టమర్ సపోర్ట్ అసోసియేట్ ఉద్యోగానికి ఇంటర్, ఐటీఐ, డిప్లొమో & ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 30 సం.లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.14,000/- జీతం + ఇన్సెంటివ్స్ ఉంటాయి. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈనెల 23వ తేదీ గురువారం "వికాస" కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ వద్ద ఉదయం 9.30 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్తో హాజరు కావలెను. మరిన్ని వివరాలకు 8297400666 సంప్రదించవలెను.

ఉమాశంకర్ జయంతి

విశాలాంధ్ర - దేవరపల్లి: దేవరపల్లి మండలం, యర్నగూడెం గ్రామంలోని పార్డ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో దివంగత ఉమాశంకర్ జయంతి ని ఘనంగా జరిపారు. సంస్థ వ్యవస్థాపకులు శ్రీ బేతాళ వీరాస్వామి కేక్ కట్ చేసి, ఉమా శంకర్ స్మృత్యర్థం బాలబాలికలకు స్వీట్స్, పెన్నులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రతికున్నా,చనిపోయినా గతం జ్ఞాపకాలు పదిల పరచాలని విజ్ఞప్తి చేస్తూ, పార్డ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ జయంతి ని జరిపినందుకు దివంగత ఉమాశంకర్ తల్లిదండ్రులైన ఎ.వి.శర్మ, సుభద్రా గణేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక విశ్లేషకులు సుంకవల్లి సత్తిరాజు మాట్లాడుతూ పుట్టిన వారు గిట్టక తప్పదని, పుట్టినందుకు ప్రతీ ఒక్కరూ జన్మ సార్థకత చేసుకోవాలని,మానవ సేవే మాధవ సేవ అనే సత్యాన్ని మరవరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చేపట్టిన బడి తర్వాత విద్యాబోధనకు సంబంధించిన బోధనా సిబ్బంది, సంస్థ ప్రతినిధులు ధూళిపూడి రవీంద్ర సోమిశెట్టి వెంకట్రావు పాల్గొన్నారు. తదనంతరం ఇటీవల మరణించిన ఎస్. భరత్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేసారు.

ఇసుక లారీ సీజ్

విశాలాంధ్ర - తాళ్లపూడి : బిల్ లేకుండా 18 టన్నుల ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ఏపి05టీఏ8249 గల లారీని సీజ్ చేసినట్లు, జేపి పవర్ వెంచర్ లిమిటెడ్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తాళ్ళపూడి ఎస్సై కె.వి.రమణ తెలిపారు. జేపీ కంపెనీ ఉద్యోగి డి. ఆనంద్ సోమవరం జరిపిన తనిఖీల్లో గజ్జరం గ్రామం వద్ద లారీ పాత బిల్లుతో రవాణా చేస్తున్నట్లు గుర్తించి పోలీస్ లకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బీసీలకు పెద్దపీట

విశాలాంధ్ర -కొయ్యలగూడెం: రాష్ట్ర చరిత్రలో లేనటువంటి విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ 11 మంది బీసీలను ఎమ్మెల్సీ లుగా నియమించి బీసీల పక్షపాతిగా జగన్ నిలిచారని బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు వెలగల దుర్గారావు పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం నాయకుల సమావేశం కొయ్యలగూడెంలో వెలగల దుర్గారావు అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి గాడిచర్ల సోమేశ్వరం మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంత్రి పదవులు, ఎమ్మెల్సీ పదవులు, కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు, అనేక రంగాలలో బీసీలను నియమించడం, బీసీలు బ్యాక్ వార్డ్ కాదు, దేశానికి రాష్ట్రానికి బ్యాక్ బోనని తెలిసే విధంగా బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, సోమేశ్వరరావు తెలిపారు. జగన్ మోహన్ రెడ్డికి రాష్ట్ర బిసి చైతన్య సంక్షేమ సంఘం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తాడిగడప ఆంజనేయరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజవరం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పాముల నాగ ముని స్వామి, జవ్వాది శ్రీను, సురవరపు గోపాల రాజు, ముప్ప వెంకటేశ్వరరావు, పట్టపగలు శ్రీను, కట్ట రాము, పాకనాటి ప్రసాద్, కట్ట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాతృ భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం ఏవో సరస్వతి అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏవో సరస్వతి మాట్లాడుతూ దేశభాషలందు తెలుగులెస్స అని, తల్లిలాంటి మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారతదేశంలో ఉన్న తెలుగు జాతి యావత్తు తెలుగు భాష ఖ్యాతిని చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన యువకులకు దేహశుద్ధి

విశాలాంధ్ర -ఆకివీడు : మాయ మాటలు చెప్పి మూడో తరగతి చదువుతున్న బాలికను అత్యాచారయత్నానికి పాల్పడిన ఇద్దరు యువకులకు స్థానికులు దేహశుద్ధి చేశారు.ఆకివీడులో స్టేషన్ రోడ్డు లో ఒక బాలిక 3వ తరగతి చదువుతోంది. తల్లి వేరే పని మీద ఊరు వెళ్లడం తో బాలికను స్టేషన్ కు సమీపన నివసిస్తున్న తోపుడుబండ్లపై జొన్న పొత్తులు అమ్మే ఇద్దరు యువకులు వలవేశారు. బాలికను హై స్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం నుంచి మార్కెట్ యార్డులోకి గోడ దూకించారు. చాక్లెట్లు కొనుక్కునేందుకు డబ్బులు ఇస్తామని నమ్మబలికారు. మార్కెట్ యార్డ్ లో పురాతన దిశకు చేరిన భవంతిలోకి తీసుకువెళ్లి అత్యాచారయత్నం చేసేలోపు ఇదంతా గమనిస్తున్న మరో ఇద్దరు యువకులు విషయాన్ని ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. అనంతరం విషయాన్ని మార్కెట్ యార్డు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఉపాధ్యాయులు, మార్కెట్ యార్డు సిబ్బంది, బాలిక బంధువులు యువకులకు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

మింత్ర తాజా బ్రాండ్ ప్రచారం విడుదల

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: మింత్రా తన తాజా బ్రాండ్ క్యాంపెయిన్ 'ప్రతిరోజూ అసాధారణంగా కనిపించండి'లో భాగంగా తన బ్రాండ్ అంబాసిడర్లు తమన్నా భాటియా, విజయ్ దేవరకొండలతో వరుస యాడ్ ఫిల్మ్లను విడుదల చేసింది. మహిళల వెస్టన్ వేర్ ఎత్నిక్ వేర్లను తమన్నా భాటియా ప్రమోట్ చేసే రెండు వాణిజ్య చిత్రాలలో, విజయ్ దేవరకొండ పురుషుల క్యాజువల్ వేర్లను ప్రమోట్ చేసే ఒక యాడ్ ఫిలింలో కనిపించారు. దేశం నలుమూలల ఉన్న వారి లక్షలాది మంది అభిమానులను ఆకర్షించేలా ఫ్యాషన్ కథనాన్ని మిత్రా సమిష్టిగా రూపొందించింది. బ్రాండ్ క్యాంపెయిన్ గురించి మింత్రా తన వినియోగదారులకు 6000 ప్రముఖ అంతర్జాతీయ, దేశీయ మరియు డీ2సీ బ్రాండ్ల విస్తృత ఎంపికల నుంచి ఉత్తమమైన ఫ్యాషన్, బ్యూటీ మరియు జీవనశైలిని ఉత్పత్తులను విస్తృత శ్రేణి ధరల వద్ద 17 లక్షల ట్రెండ్-ఫస్ట్ స్టైల్లను అందిస్తోంది. బ్రాండ్ క్యాంపెయిన్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రతి వినియోగదారుని కోసం మింత్రా ప్రత్యేకమైన ఆఫర్ను హైలైట్ చేయడం, వారి రోజువారీ ఫ్యాషన్ అవసరాలను తీర్చడం ద్వారా దేశంలోని రోజువారీ ఫ్యాషన్ను ఉన్నతీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. "ప్రతిరోజు అసాధారణంగా ఉండండి" అనే ప్రధాన ఆలోచనతో కూడిన వాగ్దానానికి అనుగుణంగా రూపొందించిన ఈ ప్లాట్ఫారమ్ తన వినియోగదారులు కోరుకునే ఇష్టమైన అంతర్జాతీయ, దేశీయ బ్రాండ్ల విస్తృత శ్రేణి నుంచి ఉత్పత్తులను ఎంచుకునేందుకు అనుమతిస్తుంది.

ఎంఎల్సిగా వంక రవీంద్రనాథ్ ఎంపిక పట్ల హర్షం

విశాలాంధ్ర-తణుకు: రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎంఎస్ఎం ఈ కార్పొరేషన్ చైర్మన్ వంక రవీంద్రనాద్ కు అవకాశం ఇవ్వడం పట్ల తణుకు యోజకవర్గ కాపు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గం లోని బీసీ, ఎస్ సి సామాజిక వర్గానికి చెందిన పలు వైసిపీ నాయకులు సోమవారం వంక రవీంద్ర నివాసం వద్ద వారిని కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థలు ఎన్నికలు ఎమ్మెల్సీ కేటాయించిన ముఖ్యమంత్రి జగన్ కు నియోజకవర్గ వైసిపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వంక రవీంద్ర మాట్లాడుతూ జగన్ స్థానిక సంస్థలు ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎంపికలో అన్ని వర్గాల వారికి పెద్దపీట వేశారన్నారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలుతోపాటు తాను నమ్ముకున్న నాయకులకు,కార్యకర్తలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని వర్గాలకు చెందిన వారికి సముచిత స్థానం కల్పించారన్నారు. ఎంపీపీ రుద్ర ధనరాజు(దను) పట్టణ అధ్యకులు మంగెన సూర్య, ఏఎంసీ,జడ్పీటీసి, నియోజకవర్గ వైసీపీ నాయకులు, వంక రవీంద్ర అభిమానులు తదితరులు రవీంద్రకు అభినందనలు తెలియజేశారు.

అట్టహాసంగా మండలికి కుడిపూడి నామినేషన్

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర శాసన మండలి తూర్పు గోదావరి స్థానిక సంస్థల నియోజక వర్గ ఎన్నికల పోటీకి మంగళవారం ఒక నామినేషన్ దాఖలు అయింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంనకు చెందిన కుడుపూడి సూర్యనారాయణరావు మంగళవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తమ నామినేషన్ పత్రాలను 10 మంది ప్రోపోజర్ల సంతకాలతో రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియకు సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ బయట కుడుపూడి సూర్యనారాయణ రావు విలేకరులతో మాట్లాడారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన సీఎం జగన్కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈయన వెంట మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వెణుగోపాల కృష్ణ, దాడిశెట్టి రాజా, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

విశాలాంధ్ర - మండపేట : మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తాతా కాళీ వెంకట శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ నటుడు వియ్యూరి నాగ సుబ్రహ్మణ్యం హాజరై మాట్లాడారు. మాతృభాష ఔన్నత్యాన్ని కొనియాడారు. లవకుశ సినిమాలో తాను కుశుడు పాత్ర పోషించానని, పదివేల సార్లు వివిధ గ్రామాలలో బుర్రకథలు చెప్పానన్నారు. అనేక ప్రాంతాల్లో ఘన సన్మానాలు, బిరుదులు పొందానన్నారు. మన భారతీయ సంప్రదాయ కుటుంబ వ్యవస్థను కాపాడు కోవాలన్నారు. పిల్లలు తల్లిదండ్రులను గౌరవించాలని చెప్పారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బంగ్లాదేశ్ లోని కొందరు యువకులు తమ మాతృభాష కొరకు చేసిన త్యాగాలను స్మరిస్తూ ఐక్య రాజ్యసమితి ప్రపంచ దేశాలు అన్నీ మాతృభాషా దినోత్సవాన్ని 21 ఫిబ్రవరి న జరుపుకోవాలని సూచించిందన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆనంద్, త్రినాథ్, కిరణ్, కేఎస్ఆర్, ఆశిష్ బాబు, మధు, గోపాలకృష్ణ, రాము, అంజి చంటి, దిలీప్, వెంకటలక్ష్మి అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం పై దాడి అప్రజాస్వామికం

విశాలాంధ్ర - కరప : తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై వైసీపీ గూండాలు దాడి చేయడం అప్రజాస్వామికమని టిడిపి కాకినాడ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస్ బాబా పేర్కొన్నారు. కరప మండలం వలస పాకల గ్రామంలో మంగళవారం రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేరా బత్తుల రాజశేఖర్, వాసిరెడ్డి ఏసుదాసు, శ్రీనివాస్ బాబా ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసీపీ పాలనలో ప్రజలు దారుణమైన కష్టాలు ఎదుర్కొంటున్నారని టిడిపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవు వెంకన్న, గుత్తాల శ్రీను, గుండపు రాజేష్, రంగారావు, కృష్ణ, వీరభద్రరావు, తదితరు నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి సమన్వయంతో పని చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ తోట రవి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జగ్గంపేట ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తోట గాంధీ, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, తోట విష్ణు తదితరులు పాల్గొన్నారు.